AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND


www.aksharatoday.in

22-10-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



2



2

బస్సు, టిప్పర్ ఢీ.. తప్పిన ప్రమాదం



ఓబీసీ మోర్చా కార్యవర్గానికి నియామక పత్రాలు

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: జిల్లా ఓబీసీ మోర్చా కార్యవర్గానికి గురువారం ఎంపీ అర్వింద్ నియామకపత్రాలు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీ కార్యవర్గ సభ్యులకు పత్రాలు అందించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వేణుగోపాల్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా : టీపీసీసీ చీఫ్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులు గురువారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా.. ప్రజాసేవే లక్ష్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. సొసైటీని ఓసారి సందర్శించాలని ప్రతినిధులు కోరగా.. తప్పకుండా రెడ్‌క్రాస్ భవనాన్ని సందర్శిస్తానన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ డాక్టర్ సీను నాయక్, ట్రెజరర్ కెంపుల నాగరాజు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రంజిత్ సింగ్, జగన్ మోహన్ గౌడ్, సభ్యులు పద్మ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కన్జ్యూమర్లకు ట్రూ అప్ షాక్!

విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ ఛార్జీల భారం పడనుంది. 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన బకాయిల వసూళ్లలో భాగంగా నవంబరులో యూనిట్‌కు 30 పైసలు, డిసెంబరు నుంచి 50 పైసలు చొప్పున వసూలు చేయనున్నట్లు సమాచారం.

- అక్షరటుడే, భీమ్‌గల్



- నవంబరులో 30 పైసలు.. డిసెంబరు నుంచి 50 పైసలు పెంపు
- రైతులకు మినహాయింపు..
- గృహజ్యోతి లబ్ధిదారులకు పాత బకాయిలపై ఉత్కంఠ

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయేతర వినియోగదారుల నుంచి రూ.5,420.23 కోట్లు వసూలు చేయనుండగా.. ఇందులో టీజీఎన్పీడీసీఎల్ పరిధి వాటా రూ.1,197.30 కోట్లు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలవారీగా ఎంత భారం పడుతుందన్నది ఇంకా వెల్లడించాల్సి ఉంది.

లక్షల్లో విద్యుత్తు కనెక్షన్లు

కామారెడ్డి జిల్లాలో 2,67,625 గృహ, 32,215 వాణిజ్య, 2,797 పారిశ్రామిక, 1,08,012 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నట్లు జిల్లా అధికారిక గణాంకాలు పేర్కొంటున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 83,619 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నట్లు వెల్లడించింది.

రైతులకు మినహాయింపు

వ్యవసాయ విద్యుత్తుకు సంబంధించిన రూ.2,214.99 కోట్ల ట్రూ అప్ వ్యయాన్ని ప్రభుత్వం భరించాల్సి ఉండగా.. ఇందులో టీజీఎన్పీడీసీఎల్ పరిధి వాటా రూ.772.50 కోట్లు. దీంతో రైతుల నుంచి ఈ మొత్తాన్ని నేరుగా వసూలు చేయరు.

గృహజ్యోతి లబ్ధిదారులకు వర్తిస్తుందా?

గృహజ్యోతి పథకం కింద అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నారు. అయితే పథకం ప్రారంభానికి ముందు వినియోగించిన విద్యుత్తుకు సంబంధించిన ట్రూ అప్ ఛార్జీలు ఈ లబ్ధిదారులకు వర్తిస్తాయా? ప్రత్యేక మినహాయింపు ఉంటుందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

జిల్లాలవారీ లెక్కలు వెల్లడించాలి..

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య, నెలకు 200 యూనిట్లలోపు వినియోగించే కనెక్షన్లు, గృహ-వాణిజ్య విద్యుత్తు వినియోగం, నవంబరు-డిసెంబరు నెలల్లో వసూలయ్యే ట్రూ అప్ మొత్తం ఎంతన్నది టీజీఎన్పీడీసీఎల్ అధికారులు వెల్లడించాల్సి ఉంది.



ఇన్‌ఛార్జి హెచ్ఎం సస్పెన్షన్

అక్షరటుడే, డిచ్‌పల్లి : మధ్యాహ్న భోజన పథకంపై నిర్లక్ష్యం వహించిన ఇన్‌ఛార్జి హెచ్ఎంపై వేటు పడింది. డిచ్‌పల్లి మండలం కమలాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం అమర్ సింగ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. 2026 సెప్టెంబర్ 15 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు పలు వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో కలెక్టర్ విచారణ జరిపించారు. మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం చోటుచేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో ఇన్‌ఛార్జి హెచ్ఎం అమర్ సింగ్‌ను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రయోజనాల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.



ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కలిసిన రెవెన్యూ ఉద్యోగుల

అక్షరటుడే, డిచ్‌పల్లి: దసరా పండుగ సందర్భంగా రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల తహశీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రెవెన్యూ పరిపాలన, ప్రజలకు అందుతున్న సేవలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై పరస్పరం అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య రెవెన్యూ శాఖ కీలకమైన వారధిగా పనిచేస్తుందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ, ప్రభుత్వ సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని చర్చించారు.



మహిళా సంఘ భవనం ప్రారంభోత్సవం

అక్షరటుడే, కోటగిరి: పోతంగల్ మండలం జిల్లాపల్లి (అబాది) గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన మహిళా సంఘం భవనాన్ని ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాసుల బాలరాజ్, స్థానిక నాయకులతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జగదాంబ మాత సేవలాల్ మహారాజ్ మందిరం 4వ వార్షికోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సమావేశాలు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు మహిళా భవనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పోతంగల్ మండలం పీఎస్ఆర్ నగర్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా రైతులు వరిసాగులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నీటి వినియోగం తక్కువగా ఉన్న పంటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చందర్, సర్పంచ్ వివేక్, ఉప సర్పంచ్ మహమ్మద్ ఖాజా, మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, ఉమ్మడి మండలాల సర్పంచుల ఫోరం అధ్యక్షులు షాజీ పటేల్, బర్ల మధుకర్, ఏఎంసీ మాజీ చైర్మన్ గైక్వాడ్ హన్మంత్, నాయకులు గంధపు పవన్, ఎజాజ్ ఖాన్, సిరాజుద్దీన్, కేశ వీరేశం, సర్పంచులు, మహిళలు పాల్గొన్నారు.

గడ్డం పెంచితే సీఎం అవుతారా.. కేటీఆర్‌పై ధర్మపురి అర్వింద్ సెటైర్లు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: తెలంగాణలో బీజేపీ పార్టీ సైలెంట్ అయిపోయిందన్న ప్రచారంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర స్థాయిలో స్పందించారు. రాష్ట్రంలో పార్టీ సైలెంట్ కాలేదని, 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ సృష్టించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభంజనం సృష్టించేందుకు తెరవెనుక పనులన్నీ వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పరస్పరం కాపాడుకుంటున్నాయని అర్వింద్ ఆరోపించారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల మధ్య పొత్తుకు చర్చలు జరుగుతున్నాయని, దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డుగా ఉన్నారని పేర్కొన్నారు. అయితే సీఎం రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ హైకమాండ్ తీవ్ర అసంతృప్తితో ఉందని, ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లుగా బీఆర్ఎస్ కాంగ్రెస్ పొత్తు ద్వారా రేవంత్ రెడ్డిని రాజకీయంగా పక్కన పెట్టాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత సోషల్ మీడియాలో పెయిడ్ ప్రమోషన్లు చేయించుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గడ్డం పెంచడంపై అర్వింద్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతావని ఎవరో చెబితేనే కేటీఆర్ అలా చేస్తున్నారని ఎగతాళి చేశారు. గతంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా సీఎం కావాలని గడ్డం పెంచుకున్నారని, కానీ ఆయన గడ్డం పెరిగింది తప్ప పార్టీ పుంజుకోలేదని గుర్తుచేశారు. కేటీఆర్‌కు కూడా గడ్డం పెరుగుతుంది తప్ప భవిష్యత్తులో ఆయన ముఖ్యమంత్రి అయ్యే ప్రసక్తే లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ సొంత బలంతో అధికారంలోకి రావడం తథ్యమని అర్వింద్ స్పష్టం చేశారు.



ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలి : కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



అక్షరటుడే, కామారెడ్డి : ఎల్‌నినో ప్రభావం ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. గురువారం సదాశివనగర్ మండలం ధర్మారావుపేట గ్రామంలోని రైతు వేదికలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి వీసీలో మాట్లాడారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టం సుమారు నాలుగు నుంచి ఐదు మీటర్ల మేర తగ్గిందని కలెక్టర్ పేర్కొన్నారు. సదాశివనగర్, పెద్దకొడప్‌గల్, మహమ్మద్ నగర్ తదితర మండలాల్లో వర్షపాతం లోటు కారణంగా పొడి వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రాబోయే ఎనిమిది నుంచి తొమ్మిది నెలలు నీటి నిర్వహణ పరంగా అత్యంత కీలకమన్నారు. నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు చిన్న చెరువులు, ఇతర నీటి వనరుల్లో నీటి లభ్యతను అంచనా వేసి పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. యాసంగిలో నీటి లభ్యతను బట్టి వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, జొన్న, మొక్కజొన్న, శనగ, కంది, వేరుశనగ వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్. వై. గిరి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

పండుగ సాయన్న ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకం

అక్షరటుడే నిజామాబాద్ సిటీ: అణగారిన, బడుగు బలహీన వర్గాల వారి కోసం పండుగ సాయన్న చూపిన ధైర్య సాహసాలు, చూపిన తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పండుగ సాయన్న జయంతిని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఆనాటి భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన ధీరుడు సాయన్న అని పీసీసీ చీఫ్ కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగించిన సాయన్న సాహసం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన కేవలం ఒక్క ముదిరాజ్ వర్గానికే కాకుండా అన్ని వర్గాల వారికి ఆరాధ్యుడని అన్నారు. మేయర్ ఉమారాణి, మాజీ ఎమ్మెల్సీ మైసంపల్లి హన్మంత్ రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాం : కలెక్టర్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు వీలుగా రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ అవసరాలకు ప్రణాళికను అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. యాసంగి సీజన్‌లో వరి సాగు చేయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడారు. వరి పంటకు బదులుగా నీటిలభ్యత ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ రానున్న రోజుల్లో ఎదురయ్యే విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలని సూచించారు. జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యాసంగిలో వరి సాగుకు నీటి సరఫరా అందుబాటులో ఉండే అవకాశం లేనందున వరిసాగు చేయవద్దని అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఆయిల్ పామ్, మొక్కజొన్న, పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించేలా చూడాలని కలెక్టర్ అన్నారు. రానున్న ఎనిమిది నుండి పది నెలలకు సంబంధించి గ్రామాల వారీగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి పాల్గొన్నారు.

పదోరోజుకు చేరిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె



అక్షరటుడే, కామారెడ్డి: జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎన్‌హెచ్‌ఎం జేఏసీ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న సమ్మె పదో రోజుకు చేరింది. గురువారం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులంతా తెల్లని వస్త్రాలు ధరించి శాంతియుత నిరసన తెలిపారు. ప్రభుత్వం స్పందించాలని, చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సమ్మె విరమించమని ముక్తకంఠంతో నినదించారు. సమ్మె శిబిరాన్ని కామారెడ్డి జిల్లా బీసీ మహిళా సంఘం సందర్శించి మద్దతు తెలిపింది. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారం అయ్యేంతవరకు అండగా మేముంటామని జిల్లా బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు బాజా లలిత స్పష్టం చేశారు. అతివలకు 180 రోజుల వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలనే కనీస సౌకర్యాన్ని ప్రభుత్వం ఎందుకు కల్పించడం లేదని, మహిళల కనీస హక్కును కాలరాయడం తగదని ప్రభుత్వానికి సూచించారు. జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి సుమన్, ప్రధాన కార్యదర్శి బట్టు పద్మజ, జాక్ నాయకులు వెంకట రమణ, హరీష్, అశ్విని, మౌనిక, అఖిల్, సందీప్, స్వాతి, స్వరూప, వేణుమాధవ్ పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకోని సీఎంను నిలదీయడానికే ‘చలో తహశీల్దార్’



అక్షరటుడే, కామారెడ్డి: వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాటలను నిలబెట్టుకోలేదని.. ఈ క్రమంలో సీఎంను నిలదీసేందుకు ‘చలో తహశీల్దార్’ కార్యక్రమం నిర్వహిస్తున్నామని భారతీయ కిసాన్ సంఘ్ తెలంగాణ నాయకులు తెలిపారు. కామారెడ్డి శివారులో కిసాన్ సంఘ్ ప్రతినిధులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రతినిధులు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం చేయలేదన్నారు. రుణమాఫీ అర్హత కలిగిన రైతులు 65 లక్షల మంది ఉండగా కేవలం 25.36 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. ఇంకా 39.64లక్షల రైతులకు వెంటనే వడ్డీతో సహా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వం రోజుకు కేవలం 8 గంటలు మాత్రమే అంతరాయంతో కూడిన విద్యుత్ ఇస్తోందన్నారు.



ఉల్లాసంగా..ఉత్సాహంగా..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

25ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట కలిశారు. ఈ సిల్వర్ జూబ్లి కార్యక్రమానికి మాక్లూర్ మండలంలోని గొట్టుముక్కల జడ్పీహెచ్ఎస్ వేదికగా నిలిచింది. - అక్షరటుడే, మాక్లూర్

గొట్టుముక్కల జిల్లా పరిషత్ పాఠశాలలో 2000-01 బ్యాచ్ విద్యార్థులు రజతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ప్రస్తుత పరిస్థితులను, కుటుంబ నేపథ్యాన్ని సభలో పంచుకున్నారు. తమ పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని, అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ హెచ్ఎం మనోహర స్వామి మాట్లాడుతూ.. అప్పటి పరిస్థితుల కారణంగా ఉన్నత చదువులు అభ్యసించలేని విద్యార్థులు ఇప్పుడు తమ పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. శ్రీ సాయి రమణ కాన్వెంట్ స్కూల్ వ్యవస్థాపకులు వెంకటరమణ మాట్లాడుతూ.. 30 ఏళ్ల క్రితం తాను ప్రైవేటుగా నడిపిన స్కూలులో ఓనమాలు దిద్దిన విద్యార్థులు తనను, తమ స్కూల్ సిబ్బందిని గుర్తు పెట్టుకొని మరి సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి ఆహ్వానించడం ఆనందంగా ఉందని చెప్పారు.

ఒకరు ఎక్కువ.. ఒకరు తక్కువ కాదు..

మ్యాథ్స్ ట్యూషన్ మాస్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ.. జీవన ప్రయాణంలో ఎందరో ఎక్కడెక్కడికో చేరుకుంటారని తెలిపారు. తోటి విద్యార్థులు ఉన్నత స్థాయిలో ఉన్నారని, తాము మాత్రం సాధారణ జీవితం గడుపుతున్నామన్న భావన ఎప్పటికీ రానీయవద్దని చెప్పారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ పూర్వ విద్యార్థులు ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం మనోహర స్వామి, ఉపాధ్యాయులు సుదర్శన్, పుష్ప, రమేశ్‌తో పాటు శ్రీ సాయి రమణ కాన్వెంట్ స్కూల్ వ్యవస్థాపకులు రమణరావు, ఉపాధ్యాయులు అల్లారి భోజన్న, హర్షవర్ధన్, ప్రకాశ్ పాల్గొన్నారు.

మొరం రోడ్డు పనుల పరిశీలన

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో బుధవారం ఎస్డీఆర్ఎఫ్ నిధులతో చేపడుతున్న మొరం రోడ్డు పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణ పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, స్థానిక కౌన్సిలర్ నరేందర్ రెడ్డి, డీఈ హన్మాంతరావు, ఏఈ వేణు ప్రసాద్, టీపీవోఎస్ వినీత్, దేవరాజు పాల్గొన్నారు.



మహా ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



అక్షరటుడే, ఆర్మూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నారు. అంబేద్కర్ చౌరస్తాలో ఈనెల 25, 26న నిర్వహించనున్న మహాధర్నా పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ధర్నాను జయప్రదం చేయాలని నాయకులు రవీందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పల్లపు వెంకటేష్, కుతాడి ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో ఘనంగా కొమురంభీం జయంతి



అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని నాగంపేట్ గ్రామంలో నాయకపోడు కులసంఘం ఆధ్వర్యంలో గురువారం కొమురం భీం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురం భీం సేవలను, ఆదివాసీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, నాయకపోడు కుల సంఘం సభ్యులు, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి కవిత తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై బస్సు, టిప్పర్ ఢీ.. తప్పిన పెనుప్రమాదం



అక్షరటుడే, లింగంపేట: వంతెనపై బస్సు, టిప్పర్ ఢీకొన్నాయి. ఈ ఘటన మండలంలోని ఎల్లమ్మ తండా వద్ద కేకేవై రహదారిపై గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. లింగంపేట నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న టిప్పర్, కామారెడ్డి నుంచి లింగంపేట వైపు వస్తున్న బస్సు అతివేగంగా వచ్చి ఎల్లమ్మ తండా వద్ద వంతెనపై ఢీకొన్నాయి. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 98 మంది ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ప్రయాణికులు పేర్కొన్నారు. కేకేవై రహదారిపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ వంతెన ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గురువారం జరిగిన ప్రమాదంతో చాలాసేపటి వరకు ఇరువైపులా రాకపోకలు స్తంభించాయి. ఎస్సై దీపక్ కుమార్ ఘటనాస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేయించడంతో వాహనచోదకులు ఊపిరి పీల్చుకున్నారు.

కులగణనను పక్కదారి పట్టించేందుకే రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం



అక్షరటుడే, కామారెడ్డి: కొంతమంది బీసీ వ్యతిరేకులు బీసీ కులగణనను తప్పుదారి పట్టించడానికే రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం చేపడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం చేసేవాళ్లంతా దేశద్రోహులేనన్నారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే వాళ్ళు మొదటగా రాజ్యాంగానికి విరుద్ధంగా అమలవుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని డిమాండ్ చేయాలని, ఆ తర్వాతనే సామాజిక రిజర్వేషన్లపై చర్చ పెట్టాలని కోరారు. రిజర్వేషన్లపై ప్రతిరోజు కుట్రలు చేస్తున్న వారికి సవాల్ విసిరారు. రిజర్వేషన్లు రద్దు కావాలని తాము కూడా కోరుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి జనగణనలో కులగణన చేర్చాలని, లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్, నర్సింహులు, శంకర్, ప్రవీణ్, వరుణ్ పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన పలువురిపై కేసులు నమోదు

అక్షరటుడే, గాంధారి: మండల కేంద్రంలో బుధవారం దుర్గాదేవి శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా డీజేకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో భక్తులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసులు నమోదు చేశామని అంతేకా కుండా రోడ్డుపై బైఠాయించి ఎస్సై డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేసిన వారిపై కూడా కేసులు నమోదు చేశామని ఎస్సై మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ విధులకు ఆటంకం కలిగించిన ప్రతి ఒక్కరిపై తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

పెద్దమ్మ ఇంట్లో చోరీకి యత్నం.. నిందితుడి అరెస్ట్

అక్షరటుడే, పెద్దకొడప్‌గల్: మండలంలోని అంజని గ్రామంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి గొలుసు చోరీకి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. లింగంపేట మండలం కంచు మహల్ గ్రామానికి చెందిన ఎగ్గడి నవీన్ కుమార్ (27) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో అంజని గ్రామంలో నివసిస్తున్న తన పెద్దమ్మ బేగరి బాలవ్వ (60) మెడలోని గొలుసును దొంగిలించాలని పథకం పన్నాడు. సెప్టెంబర్ 30న రాత్రి బైక్‌పై బాలవ్వ ఇంటికి వచ్చాడు. గుర్తుపట్టకుండా ఉండేందుకు ఇంట్లోని బల్బును తొలగించాడు. బాలవ్వ కేకలు వేయడానికి ప్రయత్నించగా, ఆమె నోరునొక్కి తన వద్ద ఉన్న కత్తెరతో మెడలోని పసుపు తాడును కత్తిరించి పరారయ్యాడు. పారిపోయే క్రమంలో ఫెన్సింగ్‌కు చిక్కుకున్న తన టీషర్టును అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పెద్దకొడపగల్ ఎస్సైఅరుణ్ కుమార్ తన సిబ్బందితో కలిసి నిందితుడిని అంజని గేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు.

డిచ్‌పల్లి బెటాలియన్‌లో పండుగ సాయన్న జయంతి

అక్షరటుడే, డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో పండుగ సాయన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి కమాండెంట్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలో సమానత్వం, ధైర్యం, సేవాభావం వంటి విలువలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని కమాండెంట్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నరసింహస్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



పీసీసీ చీఫ్‌కు ఘన సన్మానం..



అక్షరటుడే, ముప్కాల్: కాంగ్రెస్ నాయకులు గురువారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పీసీసీ చీఫ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెండోరా, బాల్కొండ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా లీగల్ స్టూడెంట్స్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షుడిగా రణదీప్ రెడ్డి

అక్షరటుడే, ఎల్లారెడ్డి: కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి ప్రాంతానికి చెందిన మిసన్‌పల్లి యువకుడు నాగరం రణదీప్ రెడ్డికి జాతీయ స్థాయిలో కీలక బాధ్యత లభించింది. ఆల్ ఇండియా లీగల్ స్టూడెంట్స్ ఫోరం (ఏఐఎల్ఎస్ఎఫ్) నూతన కార్యవర్గంలో ఆయనను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమించారు. నాగరం నరసింహ రెడ్డి కుమారుడైన రణదీప్ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రభుత్వ సిటీ కళాశాలలో చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజనీతిశాస్త్రం ప్రధానాంశాలుగా బీఏ డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని సీపీ జైన్‌లా కాలేజీలో న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ) అభ్యసిస్తూనే, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలకు సిద్ధమవుతున్నారు. డిగ్రీ చదువుతున్న సమయంలో ప్రభుత్వ సిటీ కళాశాలలో బీవీపీ జాయింట్ సెక్రటరీగా, చార్మినార్ జోనల్ సెక్రటరీగా బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థుల్లో న్యాయపరమైన అవగాహన పెంపొందించడం, రాజ్యాంగ విలువలను పరిరక్షించడం, నాయకత్వ లక్షణాలను ప్రోత్సహించడం తన లక్ష్యాలని రణదీప్ రెడ్డి పేర్కొన్నారు.

